క్లుప్తంగా

దోమల నివారణకు అందరూ సహకరించాలి



మందులు పిచికారీ చేస్తున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో దోమల నివారణకు ప్రజలు సహకరించాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ కోరారు. నగరంలోని 18వ డివిజన్‌లో శనివారం డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్‌తో కలిసి దోమల మందులను ఇంటింటా పిచికారి చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడొచ్చన్నారు. కార్పొరేషన్ సిబ్బంది ఇంటింటా దోమల మందు పిచికారీ చేస్తారని, కాలువల్లో మురుగును తొలగించడానికి స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేసుకుంటున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆస్థాన మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం బెంగళూరుకు చెందిన కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు స్వామివారి ఆస్థాన మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, భక్తులు, ఆలయ సిబ్బంది వైద్య పరీక్ష లు చేసుకున్నారు. ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో దాదాపు 150 మంది వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు, ఆలయ అధికారులు, కావేరి ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

ఇంకుడుగుంత తప్పనిసరి



ఇంకుడు గుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో గౌరి

పూతలపట్టు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు తప్పనిసరిగా ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని ఎంపీడీవో గౌరీ అన్నారు. మండలంలోని చదివిరాల పంచాయతీలో శనివారం లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంకుడు గుంత నిర్మాణం కోసం అదనంగా రూ.6 వేలు మంజూరు చేస్తుందన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల కొన్ని అంటువ్యాధుల నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం



కారకాంపల్లెలో సేవలందిస్తున్న డాక్టర్ ధాత్రేయచౌదరి

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వైద్యాధికారులు ధాత్రేయచౌదరి, వినయ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కారకాంపల్లెలో ధాత్రేయచౌదరి, చారాల గ్రామంలో వైద్యాధికారి వినయ్‌కుమార్ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజామణి, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే మూసివేత

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలపై రాష్ట్ర జాయింట్ కమిషనర్ విచారణకు ఆదేశించినా వైద్యులు, సిబ్బందిలో మాత్రం మార్పులేదు. యథావిధిగానే శనివారం మధ్యాహ్నానికే స్కానింగ్ విభాగాన్ని మూసివేశారు. సాయంత్రం 4 గంటల వరకు స్కానింగ్ సేవలు అందించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకునే దిక్కులేదు. ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలు అందించడంలో ఇప్పటికీ జాప్యం కొనసాగుతూనే ఉంది. ఆస్పత్రిని నిర్లక్ష్యపు జాఢ్యం పీడిస్తోంది.

- జాయింట్ కమిషనర్ సీరియస్
- విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని ఆదేశం
- అయినా అరకొరగానే విచారణ పూర్తి



ల్యాబ్ గదికి వేసిన తాళం



తలుపులు వేసిన స్కానింగ్ విభాగం

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ విభాగంలోని వైద్యులు, సిబ్బంది తీరుపై బాధితులు అల్లాడిపోతున్నారు. టోకన్ల ప్రక్రియను రద్దు చేయకపోగా, మధ్యాహ్నం వరకేనా సేవలంటూ రోగులు, గర్భిణులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉన్నతాధికారులు ప్రకటించినట్లుగా సాయంత్రం 4 గంటల వరకు స్కానింగ్ విభాగాన్ని కొనసాగిస్తారా, లేదా అనే విషయంపై పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

స్కానింగ్ సేవలకు కత్తెరపై విచారణ

స్కానింగ్ సేవలకు కత్తెర అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో శనివారం వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై ఏపీవీవీపీ జాయింట్ కమిషనర్ సరళమ్మ స్పందించి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి స్థాయిలో విచారించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. మహిళలు, గర్భిణుల అభిప్రాయాలను కూడా సేకరించాలని ఆదేశించారు. కానీ ఆ దిశగా ఆస్పత్రి అధికారులు విచారణ చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

కప్పి పుచ్చే ప్రయత్నం..

ఏపీవీవీపీ జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆస్పత్రి అధికారులు స్కానింగ్ విభాగంలో విచారణ చేపట్టారు. రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. టోకన్లు ప్రక్రియ ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నానికే తలుపులు వేయడం ఏమిటని, ఇకపై సాయంత్రం 4 గంటల వరకు స్కానింగ్ సేవలను కొనసాగించేలా చూడాలన్నారు. ఇలా అరగంటపాటు పీజీ వైద్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఫిర్యాదుదారులు, బాధితులను విచారించకుండా స్కానింగ్ విభాగంలో జరుగుతున్న నిర్లక్ష్యపు జాఢ్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆస్పత్రికి చెడ్డ పేరు వస్తోందని ఈ రకంగా విచారణ చేస్తున్నారని తోటి వైద్యులు, అధికారులు విమర్శలు చేస్తున్నారు. గతంలో కూడా విచారణ పేరుతో కేవలం డాక్టర్లు, సిబ్బందిని మాత్రమే విచారించి నివేదికలు పంపారని బహిరంగంగానే చెబుతున్నారు. దీంతో ఉన్నతాధికారులకు ఆస్పత్రిలో జరిగే ఘటనలు, సమస్యలు, ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ వివరాలు అందడం లేదని పలువురు విస్తుపోతున్నారు.

షరా మామూలే?

ఆస్పత్రిలో వచ్చే సమస్యలపై వైద్యులు, సిబ్బంది నుంచి తప్పిదాలు ఉన్నాయనే విషయం అందరికీ తెలిసిందే. అపోలో వాళ్లు, ప్రభుత్వ అధికారులపై పరస్పరం నిందలు వేసుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరువైపుల నుంచి తమకు సంబంధం లేదనే సమాధానం మాత్రం గట్టిగా వినిపిస్తోంది. ఏ ఫిర్యాదు వచ్చినా వాటిపై పూర్తి స్థాయిలో విచారణ చేయడం లేదు. చర్యలూ చేపట్టడం లేదు. షరా మామూలే కదా అని కొట్టి పారేస్తున్నారు.

మిగిలిన విభాగాలదీ ఇదే దారి

స్కానింగ్ విభాగం మధ్యాహ్నానికి మూతపడుతోంది. ఇదే దారిలో మిగిలిన విభాగాలు సేవలకు ముగింపు పలుకుతున్నాయి. మధ్యాహ్నం గంట కొట్టినట్లు తక్షణమే తలుపులకు తాళమేస్తున్నారు. ఆయా విభాగం వైద్యులు ప్రాక్టీసులకు వెళ్లిపోవడం, ఆ వెనుక సిబ్బంది వెళ్లిపోవడం పరిపాటిగా మారిపోయింది. ఈ కారణంగానే పలు విభాగాలకు తాళం వేలాడుతోంది. మరి కొందరు డాక్టర్లు, సిబ్బంది రిపోర్టుల పేరుతో కాలయాపన చేస్తున్నారు. విధులకు డుమ్మా కొట్టి సొంత పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పేదలు వైద్యానికి దూరమవుతున్నారు.

చర్చించి చర్యలు తీసుకుంటాం

సాక్షి కథనంపై విచారణ జరిపి నివేదిక అందించాలని ఏపీవీవీపీ జేసీ ఆదేశించారు. ఆ విభాగానికి వెళ్లి పీజీ వైద్యులను విచారించాం. మధ్యాహ్నానికే తలుపులు వేయకూడదని చెప్పాం. స్కానింగ్‌కు వచ్చిన వారిని ఎప్పటికప్పుడు చేసి పంపించాలని చెప్పాం. నాలుగు గంటల వరకు స్కానింగ్ తీయాలని మేము కూడా చెబుతున్నాం. కానీ ఆ విషయాన్ని అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం. **–డాక్టర్ అరుణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్**

అవగాహనతో మానసిక సమస్యలకు చెక్



ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

తిరుపతి తుడా: మానసిక సమస్యలను అవగాహనతో అధిగమించవచ్చని రుయా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి తెలిపారు. రుయా ఆస్పత్రిలో శనివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేనోటు సూసైడ్ డోంట్ కిల్ యువర్ సెల్ఫ్ అన్న నినాదంతో ర్యాలీ చేపట్టారు. డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ పిరికితనం వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. ఒత్తిడిని అధిగమిస్తే మానసిక సమస్య దరిచేరదన్నారు. కుటుంబ వ్యవహారాలు, ఆర్థి క సమస్యలు, మన చుట్టూ ఉన్న అనేక సమస్యల కారణంగా ఎక్కువ మంది మానసికంగా కుంగిపోతున్నారని వివరించారు. ప్రేమ వ్యవహారాలు, కాంపిటేటివ్ పరీక్షలు, పోటీతత్వం వల్ల యువతలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోందన్నారు. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. అవగాహన, కౌన్సెలింగ్, చికిత్స ద్వారా ధైర్యం పొందవచ్చన్నారు. తిరుపతి రుయాలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైకియాట్రి విభాగం మానసిక సమస్యలకు పరిష్కారవంతమైన చికిత్స అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు భారతి, మనోజ్, రాఘవ, మహేష్, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం కౌన్సిలర్ జి.మురళి, ముకుంద నాయుడు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గోపూజ

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం భక్తి శ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఉదయం మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు చేసి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గోపూజ చేశారు. ఆవు, దూడను పూలమాలతో అలంకరించి, వస్త్రాలను సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం



సూచనలిస్తున్న జిల్లా టీకా అధికారి రవిరాజు

కార్వేటినగరం: డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాజులకండ్రిగ దళితవాడను సందర్శించి విషజ్వరాలపై అవగాహన కల్పించారు. విషజ్వరాల్లో ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా కలుషిత నీరు తాగడం వల్ల వైరల్ ఫీవర్ వస్తుందని, ప్రతి దానికి ఆర్ఎంపీ వైద్యుల వద్దకు వెళ్లకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి తగిన పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వరుసగా రెండు రోజుల పాటు జ్వరం ఉంటే ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాలను ఇంటి ఆవరణలో లేకుండా చూడాలని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా దోమల నివారణకు మిలాథిన్ స్ప్రే చేయించారు. వైద్యాధికారులు గోపినాథ్, యూసఫ్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నామని..



పాడెలను మోసుకెళుతున్న గ్రామస్తులు

నగరి : కుటుంబ సభ్యులందరూ చనిపోవడం.. అయినవాళ్లు తీవ్రశోకంలో ఉండడం.. నాలుగు మృతదేహాలకు ఏకకాలంలో దహనక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి ఆ కుటుంబానికి రావడంతో ఆత్మబంధువులం తామున్నామంటూ సర్పంచ్‌తో పాటు గ్రామంలోని పెద్దలు, యువకులు ముందుకు వచ్చారు. నగరి మున్సిపల్ పరిధి ధర్మాపురం వద్ద జాతీయ రహదారి శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిట్టపాళెంకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన భూపాలన్(29), భార్య నీలావతి(26), కుమారుడు నితిన్(4), ఉమేష్(3) మృతి చెందిన విషయం తెలిసిందే. నాలుగు మృతదేహాలు చేరుకోగానే గ్రామం శోకసంద్రమైంది. బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఈ సమయంలో అంత్యక్రియల నిర్వహణలో గ్రామస్తులు మానవత్వాన్ని చాటుకున్నారు. పాడెలను శ్మశానం వరకు మోసుకువెళ్లారు. గ్రామ ఆచారం ప్రకారం మృతదేహాలను దహనం చేశారు.

రాజనాలబండలో తిరునాళ్ల సందడి

- ప్రత్యేక పూజలందుకున్న వీరాంజనేయస్వామి
- తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం
- 18 గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తజనం



నరసింహస్వామి కొండపై భక్తుల రద్దీ





భక్తులకు అన్నదానం (ఇన్‌సెట్) రాజనాలబండలో పూజలందుకున్న వీరాంజనేయస్వామి

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం నుంచి తిరునాళ్ల సందడి మొదలైంది. శ్రావణమాస చివరి శనివారం, ఆదివారం తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. తిరునాళ్లను పురస్కరించుకుని నిర్వాహకులు ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. శనివారం మండలంలోని 18 గ్రామాలకు చెందిన ప్రజలు భక్తిశ్రద్ధలతో రాజనాలబండకు చేరుకుని శ్రీ వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి రాజనాలబండకు సమీపంలో ఎత్తయిన కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కాలినడకన చేరుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండపై రాత్రి అఖండ దీపం వెలిగించారు. ఆ దీపాన్ని దర్శించుకుంటే భక్తులు పులకించిపోయారు. ఈ తిరునాళ్లకు వచ్చిన భక్తులకు జీఆర్ఎస్ రమణ, వెంగళపల్లె యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులు ప్రదర్శించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కళాకారులు మన్ననలు అందుకున్నారు. సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది బందోబస్తును ఏర్పాటుచేశారు.

పలమనేరులో అద్భుత పురాతన డిజైనులు!



ఎనుబోతుల బండ వద్ద గుహకు కట్టిన ఆలయం



కర్ణాటక సరిహద్దుల్లో శిథిలమైన జైనుల ఆలయం

జైన ఆలయాలపై పాము చిహ్నం

తీర్థంకుల్లో తొలివాడైన వృషభనాథుని నుంచి 23వ తీర్థంకురుడైన పార్శ్వనాథుడు, ఆఖరి 24వ తీర్థంకుడైన వర్ధమాన మహావీరుని దాకా ఒక్కొక్కరికి ఓ గుర్తుండేది. ఇందులో భాగంగా ఆఖరి తీర్థంకుని చిహ్నం పాముగా ఉండేది. దీంతో ఇక్కడి నాటి జైనుల ఆలయాలపై పాము చిహ్నం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.



- పలమనేరులో జైనుల శాసనాలు లభ్యం
- 24వ తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుని చిహ్నాలు
- పలు జైన ఆలయాలు శిథిలం

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో జైనుల ఆలయాలు, శాసనాల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో జైనమతాన్ని జనం అచరించినట్టు తెలుస్తోంది. ఈ జైన మతాన్ని ఆచరించేవారు నిర్మించిన ఆలయాలపై 24వ తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుని చిహ్నం పాము గుర్తు నేటికీ ఆలయాలపై కనిపిస్తోంది. కొన్ని ఆలయాలు శిథిలంకాగా మరికొన్ని ఆలయాలు ప్రస్తుతం హిందూ ఆలయాలుగా రూపాంతరం చెందాయి. ముఖ్యంగా పెద్దపంజాణి మండలంలోని కరసనపల్లిలో అప్పటి జైనుల ఆలయం, శాసనాలు కనిపిస్తున్నాయి.

జైనుల కాలం నాటి ఆలయాలు

నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం కరసనపల్లిలో నేటి చౌడేశ్వరి ఆలయం నాటి జైనుల ఆలయంగానే చరిత్రకారులు చెబుతున్నారు. పుంగనూరు సమీపంలోని సూరకుంట్లలో జైనులు నివాసం ఉన్న జైన గుహలు మునీశ్వరిని కొండపై కనిపిస్తున్నాయి. పుంగనూరుకు సమీపంలోని ఉప్పునెల్లిలో జైన శిల్పాలున్నాయి. ఇక్కడికి సమీపంలోని మినికి, పనపరెడ్డిపల్లి, ఎర్రపల్లి వద్ద ఎనుబోతుల బండలలో జైనుల చారిత్రిక ఆధారాలున్నాయి. అదేవిధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి వద్ద సాధువులు కొండ లేదా సిద్ధుల కొండ సైతం జైనులకు సంబంధించినదిగానే భావిస్తున్నారు. ఇవిగాక పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని ముళబాగిల్ తాలుకా కురుడుమల, నగవార గ్రామాల్లో జైనుల ఆలయాలు శిథిలమయ్యాయి.

ఇది జైనుల చరిత్ర

జైన గ్రంథాల మేరకు క్రీ.పూర్వం నాలుగో శతాబ్దానికే కళింగ రాజైన ఖారవేలుని ఆదరణతో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో విరాజిల్లినట్టు తెలుస్తోంది. సుప్రసిద్ధ జైనాచార్యుడైన కొండకుందాచార్యుడు అనంతపూర్ జిల్లాలోని కొనకుండ్లలో ఆశ్రమాన్ని నిర్మించుకుని అక్కడి నుంచి మదనపల్లి, పుంగనూరువైపునకు ఈ మతాన్ని వ్యాపింపజేసినట్టు తెలుస్తోంది. జైనుల ఎక్కువగా గుహల్లో ఉండేవారని గుంటుపల్లి, నెల్లిమర్ల, శాలిహుండం తరహాలో ఇక్కడ గుహలుండడం విశేషం. అదే విధంగా తమిళనాడులోని నాటి నార్త్ ఆర్కాట్ జిల్లా వళ్లిమళై ప్రధాన కేంద్రంగా అజ్జనందిన్ అనే ఆచార్యులు చిత్తూరు జిల్లాలో అప్పట్లో ఈ మతాన్ని వ్యాపింపజేసినట్టు తెలుస్తోంది. నార్త్ ఆర్కాట్ జిల్లాను బ్రిటీషువారు పాలించే నాటికే ఇక్కడ ఏడువేల మంది జైన మ తాన్ని ఆచరిస్తున్నట్టు వారి కులగణనలో ఉందని శాసన ఆన వాళ్ల నుంచి సేకరించి న సమాచారం.



కరసనపల్లి వద్దనున్న నాటి రాతి శాసనాలు





ఉప్పునెల్లి వద్దనున్న రాతిపై చెక్కిన జైనుల శిల్పాలు